సాక్షి ఆదిలాబాద్

సోమవారం ; 18 ; మార్చి ; 2024



'సూర్యఘర్'తో వెలుగులు

కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ప్రవేశపెట్టి దరఖాస్తులు స్వీకరిస్తోంది. అర్హులను ఎంపిక చేసి పథకం కింద రాయితీపై సౌర విద్యుత్ పరికరాలు అందించనుంది.

8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:28	మంగళ : 4:59

గరిష్టం/కనిష్టం
35.0/25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


మాస్‌కాపీయింగ్‌కు రంగం సిద్ధం!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా డీఈవో ప్రణీతను ఆదేశించారు. ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మాస్ కాపీయింగ్‌కు రంగం సిద్ధం' కథనానికి కలెక్టర్ స్పందించారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. దీంతో డీఈవో ఇద్దరు సింగిల్ టీచర్లకు కేటాయించిన ఎస్సెస్సీ ఇన్విజిలేషన్ విధులు రద్దు చేశారు. అలాగే ఎనిమిది కిలోమీటర్లు దాటి విధులు కేటాయించిన ఏడుగురి డ్యూటీలు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నర్సాపూర్‌లో సామూహిక వివాహాలు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్‌లో ఆదివారం సామూహిక వివాహాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. 24 ఏళ్లుగా సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ ఎంపీ గోడం నగేశ్, హరిభక్త పారాయణులు పురుషోత్తం మహరాజ్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ ఎంపీపీలు నిమ్మల ప్రీతంరెడ్డి, తులా శ్రీనివాస్, రాథోడ్ సజన్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రాల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం డీఈవో ప్రణీత పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్, లిటిల్‌స్టార్, ప్రభుత్వ పాఠశాల గెజిటెడ్ నంబర్-1, ప్రభుత్వ బాలికల పాఠశాల, సెయింట్ జోసెఫ్ కాన్వెంట్, ఎస్ఆర్‌డీజీ పరీక్షాకేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్‌లు, డీవోలను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యసేవలు, సరిపడా బెంచీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆమె వెంట సీసీ రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

'ప్రజావాణి' రద్దు

కైలాస్‌నగర్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికలాధికారి రాజర్షిషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రజావాణి కార్యక్రమ వివరాలు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

'నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా'


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ కాలనీలో నిర్వహించిన బోనాల పండుగకు హాజరయ్యారు. అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. ప్రజల అభిమానాన్ని మరిచిపోలేనని, కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా పాటుపడతానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లోనూ తన కు అండగా నిలబడి తన విజయానికి దగ్గరుండి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, కౌన్సిలర్ గంద్రత్ రేఖా కేశవ్, నాయకులు మహేందర్ స్వప్నిల్, జోగు రవి, వేదవ్యాస్, రాష్ట్ర పాల్, గొర్ల రాము, అశోక్‌రెడ్డి, భూమన్న పాల్గొన్నారు.

విజయోస్తు..


జిల్లా కేంద్రంలోని ఓ పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా 53 పరీక్షా కేంద్రాలు
- జిల్లాలో 10,511 మంది విద్యార్థులు
- పలు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- ఐదు నిమిషాలు దాటితే 'నో ఎంట్రీ'

జిల్లాకు సంబంధించిన వివరాలు
జిల్లాలోని పరీక్షాకేంద్రాలు : 53
రెగ్యులర్ విద్యార్థులు : 10,405
ప్రైవేట్ విద్యార్థులు : 106
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు : 3
కంట్రోల్‌రూం నంబర్ : 08732-226434

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 53 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేయగా, 10,405 మంది రెగ్యులర్ విద్యార్థులు, 106 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రహరీలు లేని పరీక్షాకేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిరాక్స్ సెంటర్లను మూసివేసి ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు విద్యార్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తర్వాత అనుమతించబోమని పేర్కొన్నారు. పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు.

కేటగిరీల వారీగా సెంటర్లు

పదో తరగతి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 53 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 'ఏ' కేటగిరి సెంటర్లు 20, 'బీ' కేటగిరి సెంటర్లు 18, 'సీ' కేటగిరి సెంటర్లు 15 ఉన్నాయి. కాగా, మొత్తం 10,405 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో బాలురు 5,192 మంది, బాలికలు 5,213 మంది ఉన్నారు. 106 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనుండగా ఇందులో 64 మంది బాలురు, 42 మంది బాలికలున్నారు.

మూడు సిట్టింగ్‌స్క్వాడ్ బృందాలు

పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌ను నిరోధించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లు, ముగ్గురు ఎంఈవోలు ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 53 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 53 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 14 మంది అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. 510 మంది ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ విధులు కేటాయించారు.

మాస్ కాపీయింగ్ కట్టడికి..

జిల్లాలో ప్రహరీలు లేని పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లాలో ఆరు పరీక్షాకేంద్రాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సొనాల, కొత్త, నేరడిగొండ, ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల-1, తిర్పెల్లి పాఠశాల, యాపల్‌గూడలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రంలోని ఓ గదిలో ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలను సీసీ కెమెరాల నిఘాలో భద్రపర్చనున్నారు. ప్రహరీలు లేని పరీక్షాకేంద్రాలకు ముగ్గురు పోలీస్ సిబ్బందిని నియమించి అదనపు బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా..

పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేశారు. తాగునీరు. వైద్యారోగ్యశాఖ ద్వారా ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచారు. పరీక్ష జరిగే సమయంలో ఆయా గ్రామాలకు ప్రత్యేక బస్సులు నడిపించేలా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చు. విద్యార్థులకు ఏవైన ఇబ్బందులు తలెత్తితే డీఈవో కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను లేదా 08732-226434 నంబర్‌ను సంప్రదించవచ్చు. ప్రతి పరీక్షాకేంద్రంలో తహసీల్దార్, ఎంఈవో, డీఈవో ఫోన్ నంబర్లను గోడలపై ప్రదర్శించాలని అధికారులు ఆదేశించారు.

భయంవీడి పరీక్ష రాయాలి



విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. మాస్‌కాపీయింగ్‌పై ఆధారపడొద్దు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించం. కాపీయింగ్‌ను నిరోధించేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశాం. ఏవైన సమస్యలుంటే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి.

– ప్రణీత, డీఈవో

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షిషా
- వివిధ పార్టీల నాయకులతో సమావేశం

కైలాస్‌నగర్: రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభలు, సమావేశాలు, ర్యాలీలకు సంబంధించి ఏఆర్వోల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. సువిధ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లోనూ అనుమతులు తీసుకోవచ్చని తెలిపారు. ర్యాలీల్లో డీజేలు వినియోగించరాదని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు వ్యక్తిగత దూషణలకు పాల్పడకుండా స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న రాజకీయ ప్రచార పోస్టర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రాంతాల్లో పోస్టర్లు ఏర్పాటు చేస్తే వారి నుంచి లిఖితపూర్వకంగా అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీఎంసీ కమిటీతో పాటు సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నంబర్‌తో పాటు వాటిని ప్రింట్ చేయించే వారి వివరాలు తప్పనిసరిగా ముద్రించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఇరువురిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేయవద్దని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, బెదిరింపులకు పాల్పడినా, తప్పుడు ప్రచారాలు చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటివి జరిగితే వాట్సాప్ నంబర్ 8712659973కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పార్టీలు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని తెలిపారు. రాత్రి 10నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై శ్రద్ధ చూపాలి

నేరడిగొండ: విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపై కఠినచర్యలు తప్పవని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో శనివారం 40 మంది విద్యార్థినులు వాంతులు చేసుకున్న ఘటనపై ఆరా తీశారు. ఇందుకు కారణాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో బయటి ఆహారపదార్థాలను అనుమతించవద్దని సూచించారు. శుద్ధజల ప్లాంట్‌కు వెంటనే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. భయం వీడి పరీక్షలు రాయాలని పదో తరగతి విద్యార్థినులకు సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా? అని విద్యార్థినులను ఆరా తీశారు. ఆయన వెంట అమిత్‌కుమార్, జీసీడీవో మెస్రం ఛాయ, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న దిలీప్‌కుమార్

ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి

నార్నూర్: ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఏజెన్సీ అభ్యర్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్ డిమాండ్ చేశారు. ఆదివారం హైకోర్టు న్యాయవాదితో చర్చించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లో ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న గిరిజనులకు ప్రత్యేక రిజర్వేషన్, హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఏజెన్సీ హక్కులను తుంగలో తొక్కుతూ 10శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేసిందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జనరల్ నోటిఫికేషన్ ఎలా విడుదల చేస్తారని ఆయన ప్రశ్నించారు. జనరల్ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 100శాతం రిజర్వేషన్‌తో ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే డీఎస్సీ నోటిఫికేషన్‌పై హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఏజెన్సీ గిరిజన నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆయన వెంట నాయకులు సోమేశ్‌జాదవ్, విష్ణు, వెంకటేశ్, కిశోర్ తదితరులున్నారు.


న్యాయవాదితో నాయకులు

రిలే నిరాహార దీక్ష విరమణ

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం వద్ద 62రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను ఆదివారం విరమించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సిర్రా దేవేందర్, నిమ్మల నరేందర్ మాట్లాడారు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ ఓటమి ఖాయమని విమర్శించారు. జిల్లా ప్రజల చిరకాల వాంఛ ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ కోసం చేసే పోరాటానికి తాత్కాలిక విరామం ఇస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థి ఓటమిని ప్రధాని మోదీకి కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. ఈ దిశగా జిల్లా ప్రజలకు బీజేపీ చేసిన మోసాన్ని ఇంటింటికీ వివరిస్తామని చెప్పారు. రైల్వేలైన్ ఏర్పాటయ్యేదాకా ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. సాధన కమిటీ సభ్యులు రఫీక్, భాస్కర్, ఆంజనేయులు, జాదవ్ అరుణ్, కేశవ్, వరుణ్, ఎండీ ముజీబ్, సైఫ్‌ఖాన్ తదితరులున్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఇదేం 'కర్మ'..!

జైనథ్ మండలం మారుగూడ గ్రామపంచాయతీ పరిధిలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులపై గ్రామపంచాయతీ కార్యదర్శి అశ్విన్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అర్హుల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వెబ్‌సైట్ ఓపెన్ చేయగా ఇతరుల పేరిట లాగిన్ ఐనట్లు చూపుతోంది. దీంతో అర్హుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడంలేదు. ఈ సమస్య ఒక్క మారుగూడ గ్రామపంచాయతీ పరిధిలోనే కాదు.. జిల్లాలోని దాదాపు 135 గ్రామపంచాయతీల్లోనూ ఉంది.

- అమలుకు నోచుకోని పీఎం విశ్వకర్మ
- అర్హుల ఎంపికకు తప్పని అవరోధం
- కార్యదర్శులకు లభించని అనుమతి
- వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడమే సమస్య
- జిల్లావ్యాప్తంగా 4,723 దరఖాస్తులు

కైలాస్‌నగర్: కులవృత్తులు, చేతివృత్తులపై ఆధారపడ్డ వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రధాని మోదీ గతేడాది సెప్టెంబర్ 17న పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కూడా స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 4,723 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులను ఎంపిక చేయాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఆన్‌లైన్‌లో అర్హుల వివరాలు నమోదు చేయాల్సి ఉండగా చాలామంది కార్యదర్శులకు సాఫ్ట్‌వేర్ అనుమతించడం లేదు. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో దరఖాస్తుదారులకు అన్యాయం జరిగే పరిస్థితి తలెత్తింది.

ఆమోదానికి అవస్థలు

జిల్లాలో 468 గ్రామపంచాయతీలున్నాయి. వీటి పరిధిలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కోసం 4,723 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి అర్హుల జాబితా సిఫారసు చేయడం, అనర్హులైతే రిజెక్ట్ చేయడం లాంటి బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. అయితే జిల్లాలో 135 గ్రామపంచాయతీల్లో దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేసే పరిస్థితి లేదు. ఆరుగురు గ్రామపంచాయతీ కార్యదర్శులు రెండేసి పంచాయతీల్లో బాధ్యతలు నిర్వహిస్తుండటంతో వారి ఐడీలతో వెబ్‌సైట్ ఓపెన్ చేయలేని పరిస్థితి ఉంది. మిగతా పంచాయతీల్లోని కార్యదర్శులు తమ ఐడీలను క్రియేట్ చేసే సమయంలో ఆధార్, మొబైల్ నంబర్ లాంటి వివరాలు సరిగా అందించని కారణంగా వారికి పీఎం విశ్వకర్మ ఐడీలు క్రియేట్ కాలేదు. దీంతో వారు ఈ పోర్టల్‌ను తెరవలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా తమ పరిధిలోని దరఖాస్తులను వారు ఆన్‌లైన్‌లో సిఫారసు చేయాలన్నా.. తిరస్కరించాలన్నా ఇబ్బందులేర్పడుతున్నాయి. దీనిపై జిల్లా పంచాయతీశాఖతో పాటు కామన్ సర్వీస్ సెంటర్ అధికారులను పంచాయతీ కార్యదర్శులు సంప్రదించినా ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో అర్హులు నష్టపోయే పరిస్థితి ఉండటంతో ఏం చేయాలో తెలియక కార్యదర్శులు ఆందోళనకు గురవుతున్నారు. తమ ఐడీలను సరిచేసి అర్హుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


భీంపూర్ మండలం ధనోర గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

రూ.3లక్షల వరకు సాయం

పీఎం విశ్వకర్మ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు రూ.3లక్షల వరకు ఐదు శాతం వడ్డీకే రుణం అందజేస్తారు. ముందుగా రూ.లక్ష, ఆ తర్వాత రూ.2లక్షల రుణాన్ని ఇస్తారు. నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.500 చొప్పున భత్యం చెల్లిస్తారు. శిక్షణ పూర్తైన తర్వాత రూ.15వేల విలువైన వృత్తికి అవసరమైన కిట్ ఉచితంగా ఇస్తారు.

సాంకేతిక సమస్యతోనే..

పంచాయతీ కార్యదర్శులు సరైన వివరాలు ఇవ్వని కారణంగానే ఈ సమస్య తలెత్తింది. వారి వివరాలు సేకరించి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులకు పంపించాం. ప్రారంభంలో 230 గ్రామపంచాయతీలకు 100 పంచాయతీల్లో సమస్య పరిష్కారమైంది. మిగతా పంచాయతీ కార్యదర్శుల సమస్య సాంకేతిక కారణాలతో రాష్ట్రస్థాయిలోనే పెండింగ్‌లో ఉంది. ఈ సమస్య పరిష్కరించేలా రెగ్యులర్‌గా రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడుతున్నాం.

– కామెరి రాహుల్, సీఎస్‌సీ జిల్లా మేనేజర్

'ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తాం'

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తామని జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 16,44,715 మంది ఓటర్లుండగా 2,111 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుకు 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సీ-విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. రూ.50వేలకు మించి నగదు, మద్యం సరఫరా జరగకుండా భద్రతచర్యలు చేపట్టామని తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దులో ఆరు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టుబడిన సొమ్మును జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు చూపించి తిరిగి తీసుకోవచ్చని సూచించారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

సూర్యఘర్‌తో వెలుగులు

- రాయితీపై సౌర విద్యుత్ పరికరాలు
- నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్
- తపాలాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు



బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

అర్హులు ఎవరంటే..

- 18 ఏళ్లు నిండిన భారతీయులై ఉండాలి.
- మధ్యతరగతి, పేద వర్గాలకు ప్రాధాన్యం.
- బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానమై ఉండాలి.
- సౌర ఫలకల ఏర్పాటుకు అనువైన ఇంటి పైకప్పు

కావాల్సిన ధ్రువపత్రాలు..

- ఆధార్ కార్డు
- నివాస ధ్రువీకరణ పత్రం
- ఆరునెలల విద్యుత్ బిల్లు కాపీ
- బ్యాంకు పాస్‌బుక్
- పాస్‌సైజు ఫొటో
- రేషన్ కార్డు, మొబైల్ నెం.
- అఫిడవిట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం

భైంసాటౌన్/నేరడిగొండ: సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం నూతన పథకాన్ని ప్రవేశపెట్టింది. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా రాయితీపై సౌర విద్యుత్ పరికరాలు అందించనుంది. తద్వారా లబ్ధిదారులు తమ ఇంటి పైకప్పుపై వీటిని బిగించడం ద్వారా 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ పొందేలా పథకానికి రూపకల్పన చేశారు. ఈమేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యత తపాలా శాఖకు అప్పగించగా, ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభించారు. సొంతిల్లు ఉన్నవారు ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు పత్రాలతో ఆన్‌లైన్‌లో లేదా స్థానిక తపాలాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను స్వీకరించి తపాలా సిబ్బంది ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. దీంతో అర్హులైనవారికి సోలార్ రూఫ్‌టాప్ పరికరాలు రాయితీపై అందించడంతోపాటు ఇంటి పైకప్పుపై సౌర ఫలకలు బిగించి ఇస్తారు.

గృహజ్యోతి పొందలేనివారికి ప్రయోజనం..

రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డుదారులకు గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఆపై యూనిట్లు వాడే వారికి జీరో బిల్లు వర్తించదని పేర్కొంది. దీంతో అధిక విద్యుత్ వినియోగదారులు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనతో ప్రయోజనం పొందవచ్చు. ఇందుకుగాను సొంత ఇల్లుతోపాటు యజమాని పేరిట విద్యుత్ కనెక్షన్ ఉండాలి. విద్యుత్ బిల్లు, ఆధార్, ఇతర ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. సౌర ఫలకలు అమర్చేందుకు ఇంటి పైకప్పుపై అనువైన స్థలం ఉండాలి. కిలోవాట్ సామర్థ్యం ఉన్న సౌర ఫలక బిగించేందుకు 10 చదరపు మీటర్ల స్థలం అవసరం. కిలోవాట్ సామర్థ్యం ఉన్న సౌరఫలకం రోజుకు నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. వినియోగాన్ని బట్టి ఫలకలు బిగించుకోవచ్చు.

దరఖాస్తు చేయాలి

సూర్యఘర్ పథకానికి వెబ్‌సైట్ www. pm.suryaghar.gov.in,https//pm suryaghar.g ov.inల ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. కిలో వాట్‌సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు రూ.125 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. దీంతో వినియోగదారులు డిస్కమ్ నుంచి కనీస విద్యుత్ బిల్లులను పొందే అవకాశం ఉంటుంది. వినియోగదారుడు 5 నుంచి 6 ఏళ్లలోగా తాను పెట్టిన మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ప్రభుత్వం తపాలా శాఖకు అప్పగించింది. ఆసక్తి ఉన్నవారు తపాలా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి 40 శాతం రాయితీపై సౌర విద్యుత్ పరికరాలు అందిస్తారు. విద్యుత్ బిల్లు, మొబైల్ నం, ఇతర వివరాలతో సంప్రదించాలి.

– జె.దిలీప్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, భైంసా

విస్తృత ప్రచారం చేపడుతున్నాం



పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం అమలుపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. పేద, మధ్య తరగతి ప్రజలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందడంతోపాటు అదనపు ఉత్పత్తిని డిస్కంలకు విక్రయించే వెసులుబాటు ఉంది. గ్రామీణ, పట్టణ పోస్టల్ సిబ్బంది ఈ పథకంపై సర్వే చేపట్టారు.

– కె.మహేశ్‌రెడ్డి, నేరడిగొండ పోస్టల్ శాఖ అధికారి

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

భైంసాటౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టణంలో ఆదివారం పట్టుకున్నట్లు పట్టణ సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌తోపాటు ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధురాలి అదృశ్యం



సూర చిన్నమ్మ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు సూర చిన్నమ్మ (75) అదృశ్యమైంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. సూర చిన్నమ్మ శనివారం సాయంత్రం ముత్నూర్‌లో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో కుటుంబీకులు ఆమె ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. ఆదివారం సాయంత్రం కోడలు సూర మల్లవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

భీమిని: కన్నెపెల్లి మండల కేంద్రానికి చెందిన బాలిక (15) తప్పిపోయిందని స్థానిక ఎస్సై గంగారాం తెలిపారు. అతడి వివరాల ప్రకారం... బాలిక ఈ నెల 14వ తేదీని ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి ఇంటికి రాకపోవడం బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వెతకగా ఆచూకీ కానరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్‌కు గాయాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి టేకుల బస్తీ కొత్త బస్టాండ్ ప్రధాన రహదారిపై మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఆర్టీసీ రిటైర్డు డ్రైవర్ మహమూద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నడుచుకుంటూ వెళ్తున్న మమమూద్‌ను కొత్త బస్టాండ్ వైపు నుంచి వేగంగా వచ్చి మోటార్ సైకిల్ ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు వైద్యులు రెఫర్ చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రయాణికులకు చల్లదనం పంచుతూ..



చెన్నూర్‌రూరల్: వేసవికాలం ప్రారంభమైంది. ఇప్పటికే ఎండ వేడిమికి ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ ఎండలు మరింతగా ముదిరే అవకాశాలున్నాయి. కానీ మండలంలోని అక్కెపల్లి గ్రామం నుంచి చింతలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా చల్లదనాన్ని ఇస్తూ ప్రయాణికులకు ఎండ నుంచి రక్షణ కల్పిస్తున్నాయి ఈ వృక్షాలు. దీంతో వాహనదారులు కొంతసేపు ఆ చెట్ల నీడన సేద తీరుతున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని శివారు పంటచేనులో ఈనెల 13న నవజాత శిశువును వదిలిన విషయం తెలిసిందే. శిశువు ఏడుపు విని గ్రామస్తులు చేరదీసి పోలీసులకు అప్పజెప్పారు. భీంపూర్ పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించి శిశుగృహ అధికారులకు అప్పగించారు. ప్రస్తుతం మగబిడ్డ సురక్షితంగా ఉన్నాడు. మహారాష్ట్ర నుంచి వచ్చి ఇక్కడ నవజాత శిశువును వదిలేసినట్లు భావించిన భీంపూర్ పోలీసులు దర్యాప్తు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు వరుసకు మరదలి అయిన మైనర్ బాలికను మోసగించి గర్భిణి చేశాడు. ఏమి చేయలేని పరిస్థితుల్లో నవజాత శిశువుకు జన్మనిచ్చి వదిలేసినట్లు తెలుస్తోంది. నిందితుడైన యువకుడిని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆస్పత్రికి సెలవే..!



ఉదయం 11:41 గంటలకు డ్యూటీకీ వస్తున్న ఏఎన్‌ఎం రేఖ

కడెం: వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం రోగులకు శాపంగా మారింది. ఆదివారం వస్తే చాలు..కడెం పీహెచ్‌సీ సిబ్బంది ఆస్పత్రికి సెలవు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వాచ్‌మెన్ పెద్దులు తప్ప, వైద్య సిబ్బంది లేరు. డాక్టర్ ఆదివారం అందుబాటులో ఉండడు. రోగులకు వైద్యసేవలందించాల్సిన ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్సు లేరు. సుదూర ప్రాంతాల రోగులు వచ్చి నిరాశతో వెనుదిరిగారు. ఓపీ చూడాల్సిన ఏఎన్‌ఎం రేఖ తీరిగ్గా ఉదయం 11.41 గంటలకు వచ్చింది. అప్పటికే ఔట్ పేషంట్లు వెళ్లిపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేరు.

ప్రాణాలు తీశారు..

- పక్కకు జరగమన్నందుకు..
- తాగిన మైకంలో వ్యక్తి హత్య
- మరొకరికి తీవ్ర గాయాలు



రాజు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: తాగిన మైకంలో జరిగిన గొడవలో ఓ నిండు ప్రాణం బలైంది. కూలీ, నాలీ చేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇద్దరు పిల్లలకు తండ్రిని దూరంచేసింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన అడ్లూరి కాంతా–ఆనంద్‌రావులకు నలుగురు సంతానం. వీరిలో రెండో కుమారుడైన అడ్లూరి రాజు (30) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రాణి ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఎనిమిదేళ్ల వయసున్నా కూతురు అక్షరితీ, నాలుగేళ్ల కుమారుడు విక్కీ ఉన్నారు. ప్రస్తుతం వీరు శాంతినగర్‌లో అద్దెకు ఉంటున్నారు. కాగా, శనివారం తన తల్లిదండ్రులను చూసేందుకు బాలాజీనగర్‌కు వెళ్లిన రాజు సాయంత్రం 6 గంటల సమయంలో తిరుగుపయనమయ్యాడు. వినాయక్‌చౌక్‌లోని వైన్స్ వద్ద తన బావమరిది అయిన సాగర్‌తో కలిసి మద్యం తాగాడు. పట్టణానికి చెందిన వినోద్, ప్రవీణ్‌లు వీరి పక్కన కూర్చుని మద్యం సేవించారు. కొంచెం పక్కకు జరగాలని కోరగా వారి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. రాజు, సాగర్‌లు వినాయక్‌చౌక్ నుంచి గాంధీపార్కు వైపు స్కూటీపై వెళ్తున్నారు. కక్ష మదిలో పెట్టుకున్న ప్రవీణ్, వినోద్‌లు ఆటోలో వారిని వెంబడించారు. గాంధీ పార్కు వద్ద వారిని అడ్డుకుని రాత్రి 9 గంటల ప్రాంతంలో దాడికి పాల్పడ్డారు. రాజు తీవ్రగాయాల పాలై సంఘటన స్థలంలో మృతి చెందగా గాయాలైన సాగర్‌ను స్థానికులు రిమ్స్‌కు తరలించారు. స్థానికుల సమాచారంతో కుటుంబీకులు అక్కడికి చేరుకున్నప్పటికి అప్పటికే రాజు మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదుతో సీఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి..

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. ఉమ్రి(కే) గ్రామానికి చెందిన కదం అబాజీ (35) గత కొన్నేళ్లుగా మద్యానికి అలవాటుపడ్డాడు. రెండు రోజుల క్రితం మృతుడి భార్య సంగీత శుభకార్యానికి వెళ్లింది. రెండు రోజులుగా అబాజీ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మారోతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలు కిందపడి యువతి..

బెల్లంపల్లి: పెళ్లి కావడం లేదనే మనోవ్యధతో ఓ యువతి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. బెల్లంపల్లి జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం... బెల్లంపల్లి టేకుల బస్తీకి చెందిన కొత్తూరు సుమలత (39) ఉదయం ఇంటి పనులు ముగించుకుని కన్నాల రైల్వేగేట్ వద్దకు వెళ్లింది. గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్లీడు దాటి పోతున్న వివాహం కావడం లేదనే బాధతో ఆత్మహత్య చేసుకుందని జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



భీమన్న మృతదేహం

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పీచర గ్రామానికి చెందిన రుద్రారపు భీమన్న (38)కు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో శనివారం గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడి..



శ్రీకాంత్(ఫైల్)

కుంటాల: మండల కేంద్రానికి చెందిన యువకుడు కొండం శ్రీకాంత్(20) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దేవరావు కథనం ప్రకారం.. శ్రీకాంత్ రోజు కూలీచేస్తున్న జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో గతేడాది క్రితం పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కుంటాల గ్రామ శివారులో వారి మధ్య ఆదివారం గొడవ జరిగింది. క్షణికావేశంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి తల్లితో పాటు తమ్ముడు ఉన్నారు.

సోలార్ తీగకు తగిలి మహిళ మృతి

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరి లక్ష్మి (55) ఆదివారం పంట రక్షణకు ఏర్పాటు చేసిన సోలార్ తీగకు తగిలి మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి ఏళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. ఆదివారం తమ పంట పొలంలో కూరగాయలు కొయడానికి వెళ్లింది. కూరగాయలు కోస్తున్న క్రమంలో లక్ష్మికి మూర్ఛ రావడంతో కిందపడగా పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ తీగకు తగిలడంతో షాక్‌తో సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిర్పూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతిరాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో పోలీసులు

సిర్పూర్(టి): మండలం మీదుగా ఉన్న అంతరాష్ట్ర రహదారుల్లోని చెక్‌పోస్టుల వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న మొత్తం రూ.5,26,650 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్టు వద్ద బొలేరో వాహనంలో నరులే భరత్ వద్ద రూ. 2,72,520 నగదుతో మహారాష్ట్రలోని రాజూరా పట్టణం నుంచి కౌటాల మండలానికి తీసుకెళ్తుండగా, అలాగే నాజీమ్ సలీం బక్ష్ చంద్రపూర్ పట్టణం నుంచి బెజ్జూర్ మండలానికి రూ.1,84,000 నగదు తరలిస్తుండగా, ఇంద్రజిత్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి చత్తీస్‌ఘడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా అతడి వాహనంలో రూ.70వేలకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై డికొండ రమేష్ తెలిపారు.

నగదు పట్టివేత...

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఫారెస్టు చెక్ పోస్టు ఆదివారం ఫ్లెయింగ్ స్క్వాడ్ డెప్యూటీ తహసీల్దార్ రఘునాథ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సంఘం బస్తీకి చెందిన ఓ వ్యాపారి వద్ద రూ.1,30,000 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుకున్న నగదును కాగజ్‌నగర్ రూరల్ పోలీసులకు అప్పగించారు.

ఫేస్‌బుక్‌లో ప్రకటనతో మోసం

- రూ.1.43 లక్షలు టోకరా
- వాంకిడిలో సైబర్ కేసు నమోదు

వాంకిడి: తక్కువ ధరకు కారు అమ్మబడును అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టిన పాపానికి ఓ యువకుడు రూ.1.43 లక్షలు మోసపోయిన ఘటన వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని పిప్పర్‌గోంది గ్రామానికి చెందిన రాథోడ్ చంద్రకాంత్ అనే యువకుడు ఈ నెల 5వ తేదీన తక్కువ ధరకు కారు అమ్మబడును అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టాడు. అయితే వెంటనే 8579861593 నంబరు నుంచి రామ అగార్వల్ ఆర్మీ ఆఫీసర్ అనే పేరుతో ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడిన చంద్రకాంత్ రూ.1.35 లక్షలకు కారు కొనేందుకు బేరం కుదుర్చుకున్నాడు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఫోన్ చేసి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రూ.3 వేలు పంపాలని చెప్పడంతో ఆయన ఇచ్చిన అకౌంట్ నంబరుకు ఫోన్‌పే ద్వారా పంపించాడు. 6వ తేదీన మళ్లీ ఫోన్ చేసి కంటైనర్ కిరాయి రూ.5 వేలు, ఆపై రూ.11 వేలు, రూ.11,900, తర్వాత మళ్లీ డాక్యుమెంట్ చార్జీలు అని రూ.21,500, రూ.36,999, రూ.58 వేలు, రూ.19500, రూ.18,500, రూ.2 వేలు, రూ.58వేలు ఇలా మొత్తం రై.1,43,498 పంపించాడు. మళ్లీ ఫోన్ చేసి రూ.61 వేలు పంపించాలిందిగా కోరగా బాధితుడు ఇక నా వద్ద డబ్బులు లేవని తెలపడంతో అటు వైపు నుంచి ఫోన్ కట్ అయింది. తర్వాత ఎంత ప్రయత్నించిన ఆ వ్యక్తికి ఫోన్ కలవకపోవడంతో మోసపోయానని గ్రహించి వాంకిడి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. బాధితుడు రాథోడ్ చంద్రకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

గోదాంలో ధాన్యం బస్తాల చోరీ



బయటపెట్టిన ధాన్యం బస్తాలు

భీమారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన గోదాంలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాములు వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గోదాం వద్ద టార్చిలైట్ల వెలుతురు కనిపించడంతో స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లగా ఆటోరిక్షా ట్రాలీని తీసుకొని పారిపోయారు. సంఘటనా స్థలాన్ని స్థానికులు పరిశీలించగా గోదాం షెట్టరు తాళాలు పగులగొట్టి ఉండటమే కాకుండా 55 ధాన్యం బస్తాలు కుప్పగా బయట కనిపించాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోదాంలో నిల్వ ఉంచిన ధాన్యం సంచులు హాజీపూర్ మండల నర్సింగపూర్ గ్రామంలోని దుర్గ ఇండస్ట్రీస్‌కు చెందినవిగా గుర్తించారు. మిల్లు యజమాని దర్శనాల రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. సుమారు రూ.95వేల విలువ గల ధాన్యం చోరీకి గురైనట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయాలి



వినతి పత్రంఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంచిర్యాల్‌క్రైం: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని వాయిదా అంజామ్ (18) మృతిపై పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గురుకుల నిర్వాహకురాలు నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. ఈనెల 12 న ఇంటర్ పరీక్షలు రాసి అనారోగ్యానికి గురైందని, సరైన సమయంలో వైద్యం అందించడంలో గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. విద్యార్థిని మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, నాయకులు తిరుపతి, అభినవ్, అరవింద్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులున్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. మొక్కజొన్న పంటలు నేలకొరిగింది. గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలు విరిగిపోయాయి. కొన్నిచోట్ల చెట్లు నేలకొరగా, పలుచోట్ల పడిపోయాయి. పొట్టపెల్లి నుంచి లక్ష్మణచాందకు వెళ్లే డబుల్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు విరిగిపోయాయి.



పొట్టపెల్లి వద్ద రోడ్డుపై పడిపోయిన చెట్టు



కేజీబీవీ వద్ద నేలకొరిగిన చెట్టు



పీచరలో నేలకొరిగిన మొక్కజొన్న